


నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి ఆదివారం 29-03-2026 సంపుటి: 01 సంచిక : 282 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Sunday 29-03-2026 Volume :01 Issue: 282 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani




Contact Number
9059328777

## మూసీని అడ్డుకుంటే
# శివతాండవమే

### ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు

- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం.
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష
- హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక.
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్

**రంగారెడ్డి మార్చి 28 (నేటి దర్శిని)**

రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

-మిగతా 2 లో





## ఐపీఎల్ 2026లో
# ఆర్సీబీ బోణీ

- సన్‌రైజర్స్‌పై 6 వికెట్ల తేడాతో విక్టరీ
- తేలిపోయిన సన్ రైజర్స్ బౌలర్లు

**న్యూఢిల్లీ**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయంతో ఆరంభించింది. శనివారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచులో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సన్ రైజర్స్ నిర్దేశించిన 202 పరుగుల లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే ఛేదించింది. ఛాంపియన్ ఆటకు అర్థం చెబుతూ అదరగొట్టింది. 202 పరుగుల

-మిగతా 2 లో



# బెట్టింగ్ ఊబిలో పడొద్దు..

- బతుకును ఛిద్రం చేసుకోవద్దు
- ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్**

బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా

-మిగతా 2 లో





## గల్ఫ్ దేశాలకు
# ఇరాన్ వార్నింగ్

- శత్రుదేశాలకు మీ భూమిని ఇవ్వొద్దు..
- అలా చేస్తే శత్రుస్థావరాలు భూస్థాపితం అయ్యేవరకు మేం దాడులు చేస్తూనే ఉంటాం.
- 'మేం ముందుగా ఏ దేశంపైనా దాడి చేయబోమని ఎన్నోసార్లు చెప్పాం
- మా ఆర్థిక మూలాలు, నిర్మాణాలపై దాడి జరిగినప్పుడు మాత్రమే మేం ఎదురుదాడి చేస్తాం

**న్యూఢిల్లీ**

అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం కొనసాగుతున్న వేళ పొరుగునే ఉన్న గల్ఫ్ దేశాలకు ఇరాన్ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ శత్రుదేశాలైన అమెరికా, ఇజ్రాయెల్‌లకు తమ దేశాల్లో చోటు ఇవ్వొద్దని సూచించింది. గల్ఫ్ దేశాల్లో అమెరికా మిలిటరీ స్థావరాలు ఏర్పాటు చేసుకుని, అక్కడ్నుంచి ఇరాన్‌పై దాడిచేస్తోంది. అందువల్ల తమ దేశంపై దాడి చేసేందుకు అనువుగా అమెరికా సహా ఏ దేశానికి స్థలం ఇవ్వొద్దని ఇరాన్ కోరింది.ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ శనివారం ఒక ప్రకటన చేశారు. సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, కువైట్, ఖతార్ దేశాలు ఈ ప్రాంతంలో అభివృద్ధి, రక్షణ కోరుకుంటే తమ శత్రుదేశాల సైన్యాన్ని వారి భూభాగంలోకి అనుమతించకూడదని సూచించారు.

-మిగతా 2 లో



## యుద్ధం సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాం

అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడింది

2 లో

## భార్యతో అసహజ శృంగారం నేరం కాదు..

### మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు



2 లో

## కాళేశ్వరం అవినీతికి కేసీఆర్
# బాధ్యుడు


### అవినీతిని పట్టుకోవడంలో సీఎం రేవంత్ విఫలం

- ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం
- సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది.
- రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు.
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ మార్చి 28 (నేటి దర్శిని)**

కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా

-మిగతా 2 లో



## బెంగాల్‌ను టార్గెట్ చేస్తే..
# కేంద్రంలో బీజేపీని గద్దె దించుతా

- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగిస్తుంది
- బీజేపీ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టింది
- రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం

**న్యూఢిల్లీ**

పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పై తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్ లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమబెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీ దేశంలో అధికారం కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి

-మిగతా 2 లో



# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో


- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్



**హైదరాబాద్, మార్చి 28 (నేటి దర్శిని)**

హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది.

-మిగతా 2 లో



# యుద్ధం ఎఫెక్ట్..

- తీవ్ర ఇంధన సంక్షోభంలో పాకిస్థాన్..
- గ్యాస్ సిలిండర్ ధర ఎంతో తెలుసా..?

**న్యూఢిల్లీ**

యుద్ధం కారణంగా దాయాది దేశం పాకిస్థాన్ తీవ్ర ఇంధన సంక్షోభంలో చిక్కుకున్నది. పశ్చిమాసియా లో నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావంతో అక్కడ లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. దేశవ్యాప్తంగా 11.67 కిలోల గ్యాస్ సిలిండర్ ధర.. పాకిస్థాన్ రూపాయల్లో ఏకంగా రూ.5,135 స్థాయికి పెరిగింది. పంజాబ్ ప్రావిన్స్ లో

-మిగతా 2 లో

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

మొదటి తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# యుద్ధం సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాం

### అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడింది

న్యూఢిల్లీ

పశ్చిమాసియా లో ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు చేస్తున్న యుద్ధంతో ప్రపంచ దేశాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పలు దేశాలను ఇంధన కొరత ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఈ క్రమంలో యుద్ధం విసురుతున్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రధా నరేంద్ర మోదీ అన్నారు. శనివారం నొయిడా లో అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని ప్రధాని అన్నారు. అక్కడ నెల రోజులుగా భీకర యుద్ధం కొనసాగుతోందని చెప్పారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆయన ఆందోళన



వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందని తెలిపారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ సంక్షోభం నుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు. ఇలాంటి సమయాల్లో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంలో ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయవద్దని ప్రత్యర్థి రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు దేశ ప్రయోజనాలకు, దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయని ప్రధాని చెప్పారు. కాగా నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంటుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్‌లను అనుసంధానిస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌ను కూడా నిర్మించారు.

# భార్యతో అసహజ శృంగారం నేరం కాదు..

### మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ

ఓ కేసులో మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. భార్య తో 'అసహజ శృంగారం' జరిపారన్న ఆరోపణలపై భర్త మీద ఐపీసీ సెక్షన్ 377 కింద కేసు నమోదు చేయడం చెల్లదని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్వాలియర్ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాకు చెందిన ఓ మహిళ తన భర్తపై తీవ్ర ఆరోపణలు చేసింది.తన భర్త తనపై అసహజ శృంగారానికి పాల్పడ్డాడని, వరకట్నం కోసం వేధించాడని, దాడిచేసి బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు ఆమె భర్తపై సెక్షన్ 377 (అసహజ నేరాలు), 498ఏ (వరకట్న వేధింపులు), 323 (దాడి), 506 (బెదిరింపులు) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును రద్దు



చేయాలని కోరుతూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మిలింద్ రమేష్ ఫడ్కే, సెక్షన్ 377 కింద నమోదైన కేసును కొట్టివేశారు.వివాహిత దంపతుల మధ్య జరిగే లైంగిక చర్యలను ఈ సెక్షన్ కింద నేరంగా పరిగణించలేమని ధర్మాసనం అభిప్రాయపడింది. వైవాహిక బంధంలో భర్త తన భార్యతో చేసే లైంగిక చర్య అత్యాచారం కాదని సెక్షన్ 375 లో ఉన్న మినహాయింపును కోర్టు ప్రస్తావించింది. అందువల్ల భార్యాభర్తల మధ్య జరిగే అసహజ సంభోగాన్ని కూడా సెక్షన్ 377 కింద నేరంగా చూడలేమని స్పష్టంచేసింది. అయితే వరకట్న వేధింపులు, దాడి, బెదిరింపులకు సంబంధించిన ఇతర సెక్షన్ల కింద కేసులను కొట్టివేయడానికి కోర్టు నిరాకరించింది.అసహజ శృంగార ఆరోపణ మినహా ఇతర ఆరోపణలపై విచారణ కొనసాగించాలని ఆదేశించింది. ఇటీవల గ్వాలియర్-చంబల్ ప్రాంతంలో వైవాహిక వివాదాల్లో సెక్షన్ 377ను ఆయుధంగా వాడుతున్నారని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

# కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

మొదటి తరువాయి

మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

మొదటి తరువాయి

నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన పక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది.

# ఐపీఎల్ 2026లో ఆర్సీబీ బోణీ

మొదటి తరువాయి

లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ 7 బంతుల్లో 8 రన్స్ చేసిన తర్వాత ఔట్ అయ్యాడు. అయితే ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్‌తో విరాట్ కోహ్లీ .. మెరుపు భాగస్వామ్యం నమోదు చేశాడు. తొలుత పడిక్కల్ ఎదురుదాడికి దిగగా.. ఆపై కోహ్లీ కూడా జాయిన్ అయ్యాడు. దీంతో ఆర్సీబీ స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఎప్పుడెప్పుడు మ్యాచ్ ముగిద్దామా అన్నట్లు ఆర్సీబీ ప్లేయర్లు బ్యాటింగ్ చేశారు.కోహ్లీ, పడిక్కల్ కలిసి మూడో వికెట్‌కు 45 బంతుల్లో 101 రన్స్ చేసి.. జట్టు విజయాన్ని ఖరారు చేశారు. 26 బంతుల్లో 61 రన్స్ చేశాక పడిక్కల్ ఔట్ అయినా.. కోహ్లీ మాత్రం తగ్గలేదు. చివరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించాడు. కోహ్లీ ఈ మ్యాచులో 38 బంతుల్లో 69 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. కెప్టెన్ రజత్ పాటీదార్ 12 బంతుల్లో 31 రన్స్ చేసి విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. దీంతో ఆర్సీబీ 15.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఐపీఎల్ 2026ను విజయంతో ఆరంభించింది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ 38 బంతుల్లో 80 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ.. 4 ఓవర్లలో 22 రన్స్ ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరగనుంది.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు..

మొదటి తరువాయి

ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# గల్ఫ్ దేశాలకు ఇరాన్ వార్నింగ్

మొదటి తరువాయి

ఈ సందర్భంగా పెజెష్కియాన్ ఎక్స్ వేదికగా స్పందించారు. "మేం ముందుగా ఏ దేశంపైనా దాడి చేయబోమని ఎన్నోసార్లు చెప్పాం. మా ఆర్థిక మూలాలు, నిర్మాణాలపై దాడి జరిగినప్పుడు మాత్రమే మేం ఎదురుదాడి చేస్తాం. ఈ ప్రాంతంలోని పొరుగు దేశాలకు చెప్పేదేంటంటే.. శత్రువులు మాపై యుద్ధానికి మీ నేలను వాడుకోనివ్వకండి. అలా చేస్తే శత్రుస్థావరాలు భూస్థాపితం అయ్యేవరకు మేం దాడులు చేస్తూనే ఉంటాం. వారికి సహకరించిన వారిని కూడా వదలబోం" అని ఆయన పేర్కొన్నారు.గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలపై కూడా దాడులు జరిగాయి. దీంతో ఆయా దేశాలకు తీవ్ర నష్టం జరిగింది. దీని ఫలితంగా చమురు ఉత్పత్తి భారీగా తగ్గిపోయే అవకాశం ఉంది. మరోవైపు అమెరికా, ఇరాన్ మధ్య చర్చల ప్రతిపాదన వచ్చింది. కానీ, ఈ విషయం ఒక కొలిక్కి రావడం లేదు. చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి.

### బెంగాల్‌ను టార్గెట్ చేస్తే..

# కేంద్రంలో బీజేపీని గద్దె దించుతా

మొదటి తరువాయి

ముందుకు వెళ్తానని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు.రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఓటర్లను హెచ్చరించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ బీజేపీ నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను బీజేపీ పావులా వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితోపాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో గెలువగానే దేశంలోని ఇతర రాజకీయ పార్టీలతో కలిసి కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని హెచ్చరిక చేశారు.

# యుద్ధం ఎఫెక్ట్..

మొదటి తరువాయి

ఈ ధరల పెరుగుదల మరీ ఎక్కువగా ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు తెలుపుతున్నాయి.గ్యాస్ ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఎల్‌పీజీతో నడిచే ఆటోలు, బస్సులు, మినీ బస్సుల రవాణా చార్జీలు పెరగడంతో తక్కువ, మధ్యతరగతి ఆదాయ వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మరోవైపు ఈద్, నౌరోజ్ సెలవుల కారణంగా ఇరాన్ నుంచి గ్యాస్ సరఫరా గణనీయంగా తగ్గింది. దాంతో సంక్షోభం మరింత తీవ్రమైంది. పాకిస్థాన్‌లో ఇంధన నిల్వలు కూడా ప్రమాదకర స్థాయిలో అడుగంటిపోయాయి. దేశంలో కేవలం 11 రోజులకు సరిపోయేంత మాత్రమే ముడి చమురు ఉంది.అదేవిధంగా 27 రోజులకు సరిపోయే పెట్రోల్, 21 రోజులకు సరిపోయే డీజిల్, 9 రోజులకు సరిపోయే ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి. ఈ విషయాన్ని పాకిస్థాన్ పెట్రోలియం శాఖ కార్యదర్శి సెనేట్ కమిటీకి తెలిపారు. పాకిస్థాన్ తన పెట్రోలియం అవసరాల్లో దాదాపు 70 శాతం మధ్యప్రాచ్యం నుంచే దిగుమతి చేసుకుంటున్నది. ప్రస్తుత సంక్షోభంవల్ల సరఫరా మార్గాలు దెబ్బతిన్నాయి. సరఫరాలో అంతరాయాల కారణంగా ఏప్రిల్ 14 తర్వాత దేశంలో తీవ్రమైన గ్యాస్ కొరత ఏర్పడవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సొంతింటి కల సాకారం....

**●ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు.......**



**ఆమనగల్లు, మార్చి 28(నేటి దర్శిని ప్రతినిధి):** ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరుతుందని ఆమనగల్లు మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం.కేశవులు అన్నారు. గుర్రం కేశవులు మాట్లాడుతూ నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయన్ పల్లి తండాలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఇందిరమ్మ ఇండ్లను ఆయన ప్రారంభించారు. లబ్ధిదారులు జటావత్ జ్యోతి శంకర్, హౌసింగ్ డిఇ శైలజ,ఏఈ శాలినీ, వీరితో కలిసి కేశవులు ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీకి కట్టుబడి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు ప్రభుత్వం చొరవ చూపిందని, లబ్ధిదారులు నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టి బిల్లులు పొందాలని గుర్రం కేశవులు సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో పేదల సొంతింటికల సాకారం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తండా నాయకులు రాగ్య నాయక్ ,శ్రీను, గోపాల్ ,రమేష్ ,శంకర్, కుమార్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ఢీకొని యువకుడు మృతి...



**ఆమనగల్లు,మార్చి 28(నేటి దర్శిని ప్రతినిధి):** బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన శనివారం ఆమనగల్లులో చోటుచేసుకుంది. ఆమనగల్లు పట్టణంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది.కాచిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును అతివేగంగా వచ్చి బస్సును బైకు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో చెన్నకేశవ కాలనీకి చెందిన వల్లపు చరణ్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.ఈ ఘటనతో చెన్నకేశవ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నుచ్చుగుంట తండాలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం..



**ఆమనగల్లు, మార్చి 28(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు నుచ్చుగుంట తండాలో నూతన సీసీ రోడ్డు పనులను మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్ పర్సన్ కలిసి ప్రారంభించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్ గీత చారి మాట్లాడుతూ ఆమనగల్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడం తమ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా మూడవ వార్డులో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజ్, వీధిలైట్లు , తాగునీటి వంటి మౌలిక వసతులను మెరుగుపరచి ప్రజలకు అన్ని సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపాలిటీ చైర్మన్ రాంపాల్ నాయక్, కౌన్సిలర్లు సునీత ప్రశాంత్ నాయక్, నిరంజన్ నాయక్, బిజెపి సీనియర్ నాయకులు రవి రాథోడ్, తార్యా నాయక్ రఘునాయక్ సంతోష్, లక్ష్మణ్, జానయ్య, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతతో హోటల్ యజమానులు ఆవేదన

**● వ్యాపారాలు నిలిచిపోవడంతో జీవనోపాధిపై ప్రభావం**



**చింతపల్లి, మార్చి 28 (నేటి దర్శిని ప్రతినిధి):** చింతపల్లి మండల కేంద్రంతో పాటు మాల్ వెంకటేశ్వర్ నగర్, పరిసర గ్రామాల్లో కమర్షియల్ గ్యాస్ కొరత తీవ్రంగా ఉండటంతో హోటల్, బేకరీ, స్వీట్ షాప్ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ అందుబాటులో లేక వ్యాపారాలు నిలిచిపోవడంతో బతుకులు రోడ్డున పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు షాపుల అద్దెలు, మరోవైపు కార్మికుల జీతాలు భరించలేక ఆర్థికంగా కుంగిపోతున్నామని యజమానులు తెలిపారు. కొందరు జీవనోపాధి కోసం కట్టెల పొయ్యిలను ఆశ్రయిస్తున్నా, అద్దె షెట్టర్లలో వ్యాపారం చేసే వారికి అది కూడా సాధ్యం కావడం లేదు. గ్యాస్ లభ్యం కాక పిల్లల చదువు ఖర్చులు, ఇంటి ఖర్చులు భారం అవుతున్నాయని వారు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేపట్టి తమకు ఉపాధి భరోసా కల్పించాలని యజమానులు కోరుతున్నారు.


# బైరమల్ గూడ గండమ్మ దేవాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 39 లక్షలు మంజూరు

**●ఎంఎంసీ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించిన మధుయాష్కి గౌడ్**



**కర్మన్ ఘాట్, మార్చి28 (నేటి దర్శిని):** కర్మన్ ఘాట్ డివిజన్ బైరమల్ గూడ లోని గండమ్మ దేవాలయం వద్ద సీసీ రోడ్డు పనులకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ నిధులు మంజూరు చేయించారు. గతంలో గండమ్మ దేవాలయం వద్ద వర్షాకాలంలో వరద నీరు నిలుస్తూ స్థానికులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉండేది. స్థానికులు మధు యాష్కిని సంప్రదించడంతో రూ. 42 లక్షల నిధులు మంజూరు చేయించి వరద నీటి పైపులైన్లను నిర్మించి సమస్యను తీర్చడం జరిగింది. క్రమంలో పైపులైన్ల పనుల వల్ల రోడ్డు దెబ్బతిని గుంతల మయంగా మారింది. ఈ క్రమంలో నూతనంగా రోడ్డు నిర్మించి తమ సమస్య తీర్చాలని కాలనీ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యారగోని ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మధుయాష్కిని కోరారు. ఈ క్రమంలో స్పందించిన ఆయన మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి నూతనంగా రోడ్డు నిర్మించాలని సూచించడం జరిగింది. దీంతో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 39 లక్షల నిధులను ఎంఎంసీ అధికారులు మంజూరు చేశారు.

# ధర్మపాలనలో శ్రీరాముడు ఆదర్శం





**● ఉప్పల శ్రీనివాస్ గుప్త**

**నాగోల్, మార్చి28 (నేటి దర్శిని):** శ్రీరామ నవమి సందర్భంగా నాగోల్ డివిజన్‌లో పలు దేవాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. జైపూరి కాలనీ సాయి బాబా దేవాలయం, బండ్లగూడ రామాలయం, అనంతుల జంగారెడ్డి కాలనీ, నర్సింహా స్వామి కాలనీ తదితర ప్రాంతాల్లో జరిగిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. స్థానిక నాయకులు అనిల్ కుమార్, కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు గ్రేటర్ కమ్యూనిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే నాగోల్ కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో శరత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీతారాముల కళ్యాణంలో పాల్గొని వొడి బియ్యం పోశారు. రామ్ నగర్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గుండు వద్ద ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. మనికొండ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారామ కళ్యాణం సహా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు దేవాలయాల్లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, ధర్మాన్ని కాపాడేందుకు తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత ప్రజాపాలకుడు శ్రీరాముడు అని పేర్కొన్నారు. లోకకల్యాణం కోసం ఎన్నో త్యాగాలు చేసిన సీతారాముల పవిత్ర బంధం యుగయుగాల పాటు నిలిచే ఆదర్శమని, భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని ఆయన అన్నారు.

# వరంగల్ పోలీస్ రేంజ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**ఉమ్మడి వరంగల్, మార్చి 28 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ పోలీస్ రేంజ్ నూతన పరిపాలన కార్యాలయ భవనాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన కార్యాలయం ద్వారా వరంగల్ రేంజ్ కు సంబంధించిన పోలీస్ అధికారుల శాఖపరమైన పరిపాలన కార్యకలాపాలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. నూతన కార్యాలయం అందుబాటులోకి రావడం వల్ల పరిపాలన మరింత సులభతరం కానుందని, పోలీస్ సేవలు మెరుగుపడతాయని సిపి తెలిపారు. అధికారుల సమస్యలపై తక్షణ స్పందన అవసరమని సూచించారు. పరిపాలనలో పారదర్శకత బాధ్యతమైన పనితీరు ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపిలు ధార కవిత, అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు , సూపరిండెంట్ యుగంధర్, ఏసీపి లు సత్యనారాయణ, నరసింహారావు ,సురేంద్ర తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# క్రిష్ణా నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం మహోత్సవం

**నాగోల్, మార్చి28 (నేటి దర్శిని):** నాగోల్ డివిజన్ పరిధిలోని క్రిష్ణా నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం ఎంతో ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో సుమారు 250 మంది పైగా భక్తులు పాల్గొని సీతారాముల చంద్రుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన కాలనీ అసోసియేషన్ వారికి భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీనివాసచారి, వైస్ ప్రెసిడెంట్ శివ శంకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ రాజా వర్ధన్ రెడ్డి, శ్రీ విద్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నప్రసాద వితరణలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






## సంపాదకీయం

# బతుకులు ‘బుగ్గి’పాలు!



రోజువారి చెమటోడ్చి పొట్టనింపుకునే చేతులు..కుటుంబపోషణ కోసం ప్రయాణించిన పాదాలు.. ఒక్క క్షణంలో అగ్నికి ఆహుతైపోయాయి. ఏపీలోని మార్కాపురం దగ్గర రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం రవాణా వ్యవస్థలోని లోపాలను మరోసారి బహిర్గతపరిచింది. ప్రయివేటు బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో పద్నాలుగు మంది సజీవ దహనమవ్వడం తీవ్ర విషాదం. ప్రాణాలు కోల్పోయిన వారంతా కూలీలే కావడం మరీ హృదయ విదారకం. ఉన్న ఊరును, కన్నవారిని వదిలి ఉపాధి కోసం వలసొచ్చిన వారు, చివరకు కుటుంబాలనే అంధకారంలోకి నెట్టారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వాల, ప్రయివేటు యాజమాన్యాల నిర్లక్ష్యమే! ఎందుకంటే, గతేడాది కర్నూల్‌లో జరిగిన ఘటనలో ఇలాగే పందొమ్మిది మంది అసువులు బాశారు. చేవెళ్లలో టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఇరవై మందివరకు కంకర కుప్పల్లోనే ఊపిరొదిలారు. ఇలా వరుస ఘటనలు జరుగుతున్నా అధికారులు పాఠాలు నేర్వక పోవడం విచారకరం.

తాజా ఘటనలో మృతుల వివరాలు చూస్తే సామాన్యుల దుస్థితి స్పష్టమవుతోంది. వారంతా బతుకుదెరువు కోసం ఏపీ నుంచి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు వలసొచ్చిన కూలీలు. కొందరు ఇటుకబట్టీల్లో పనిచేస్తే మరికొందరు భవన నిర్మాణరంగాల్లో స్థిరపడ్డారు. రోజూ పనిచేస్తేనే నాలుగువేళ్లూ నోట్లోకి వెళ్తాయి, లేదంటే పస్తులే. ఆస్తిపాస్తులేమీ లేవు. వచ్చే పదోపరకతోనే కుటుంబాన్ని పోషించుకుంటారు. శ్రీరామనవమి సందర్భంగా కొందరు, ఆప్తులను చూసొద్దామని మరికొం దరు సొంతూళ్లకు బయలుదేరారు. కానీ, వారి బతుకులు కన్నవారిని కలుసుకోకుండానే తెల్లారి పోయాయి.వారు ప్రయాణించిన హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సు కూడా పూర్తిగా వారిని అభద్రతలోకే నెట్టేసింది. బస్సుకు మరమ్మతులు చేయించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. గమ్యస్థానానికి మరో మూడు గంటల సమయం ఉందనగా స్టీరింగ్ అదుపు తప్పి నేరుగా టిప్పర్ డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. వెంటనే అంటుకున్న మంటలు ప్రయాణికులను అగ్నికీలల్లో ముంచేశాయి. ఇన్ని వందల కిలోమీటర్ల మధ్య బస్సు ఫిట్‌నెస్‌ను ఒక్క అధికారి కూడా పరిశీలించక పోవడం ఇక్కడ ఆశ్చర్యకరం. డ్రైవర్లలో ఎవరిది తప్పన్నది కాసేపు పక్కన బెడితే అమాయకులు చనిపోయారు. బాధ్యత ఎవరు వహిస్తారు? పాలకులా, ప్రయివేటు యజమానులా? కండీషన్ లేని బస్సును బయటకు తీసుకురావడం ప్రమాదానికి అసలు కారణం. అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్టర్ అయిన బస్సు తెలంగాణ, ఏపీల్లో తిరుగుతుంటే పర్యవేక్షించి సీజ్ చేయకపోవడం అధికారుల అలసత్వం. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావిడి చేయడమే తప్ప, ప్రమాదాలు జరగకుండా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు పూర్తిగా శూన్యం! ప్రయివేటు ట్రావెల్స్‌కు లాభాలే ముఖ్య మన్నది తెలిసిందే. డ్రైవర్లకు సరైన విశ్రాంతి కూడా ఇవ్వడం లేదనే విమర్శలు అనేకం. ఎమర్జెన్సీ డోర్లు, ఫైర్‌సేఫ్టీ వ్యవస్థలు పనిచేయక పోవడం వంటివి కోకొల్లలు. రాత్రి ప్రయాణాల్లో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం, పర్యవేక్షించే నెట్‌వర్క్ లేకపోవడం వీటికి అదనం. ఇక ఫిట్‌నెస్ తనిఖీల్లో అవినీతి, కేవలం కాగితాలపైనే పరిశీలనలు ‘మామూలే’! ఇవి మన వ్యవస్థలో దాగున్న లోపాలు. చేవెళ్లలో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కచెల్లెళ్లు చనిపోయిన ఘటన మన మనసును ఇప్పటికీ కలచివేస్తూనే ఉంది. ఇప్పుడు ఏపీలో జరిగిన ప్రమాదంలోనూ అదే కథ. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబమే ఇప్పుడు కూలిపోయింది. ఇంకోచోట వృద్ధ తల్లిదండ్రులను చూసుకునే ఏకైక కుమారుడు మృతిచెందడంతో వారికి ఆధారమే లేకుండా పోయింది. కాగా అభంశుభం తెలియని చిన్నపిల్లలు వారి తండ్రికోసం ఎదురు చూస్తుండగా విన్న మరణవార్త వారి భవిష్యత్తునే చీకట్లోకి నెట్టేసింది. ప్రాణాలు కోల్పోయిన కూలీల కుటుంబాల రోదన మాటల్లో చెప్పలేం. ‘మా వాళ్లు ఏం పాపం చేశారు? ఎందుకు మాకీశోకం?’ వారి కన్నీళ్లు పాలకులపై ఇప్పుడు ప్రశ్నలుగా నిలుస్తున్నాయి. ప్రతి ప్రమాదం తర్వాత విచారణలు, పరిహారం ప్రకటనలు వస్తున్నా మూల కారణాలపై చర్యలు మత్రం కనిపించడం లేదు. తనిఖీల్లో నిర్లక్ష్యం, ట్రాఫిక్ నియమాల అమలులో బలహీనత, ఇవే ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. ఇలాంటివి మీడియాలో వచ్చినప్పుడో, లేదంటే మరేదైనా ఘటన జరిగినప్పుడో తప్ప మన అధికారుల స్పందన ‘అంతంత’ మాత్రమే! ఇకనైనా తెలుగు రాష్ట్రాల్లోని పాలకులు మేల్కోవాలి. ప్రయివేటు ట్రావెల్స్‌పై కఠిన నియంత్రణలు అమలుచేయాలి. ప్రజల ప్రాణాలు లాభాలకంటే విలువైనవని గుర్తించాలి. లేదంటే, ఇలాంటి ప్రమాదాలు పేదల జీవితాలను నిత్యం ఛిద్రం చేస్తూనే ఉంటాయి.

# శాంతి కావాలంటే మేం చెప్పినట్టు వినాలి

### గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక



టెహ్రాన్ మార్చి 28 (నేటి దర్శిని)

అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక దాడుల నేపథ్యంలో గల్ఫ్ దేశాలపై ఇరాన్ విరుచుకుపడుతున్నది. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు చేశారు. గల్ఫ్ దేశాల్లో దాడులు ఆగాలన్నా..శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్టు వినాలన్నారు.ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకొని శత్రువులు తమపై దాడి చేస్తున్నారని అన్నారు. గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వొద్దని గల్ఫ్ దేశాలకు సూచించారు. శత్రు స్థావరాలు భూస్థాపితం అయ్యే వరకు దాడులు కొనసాగిస్తామని అన్నారు.

# రేప్ కేసుల్లో బాధితుల పేర్లను వెల్లడించొద్దు’



న్యూఢిల్లీ మార్చి 28 (నేటి దర్శిని)


అత్యాచార కేసుల్లో బాధితుల పేర్లను ప్రస్తావించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. బాధితుల పేర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడించకూడదని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. 2018 నాటి తన తీర్పులో ఏ వ్యక్తి అయినా తమ ఆదేశాలను ఉల్లంఘించి బాధితుల పేర్లను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ముద్రించడం, ప్రచురించడం చేయకూడదని ఆదేశించింది. ఇది వరకు వెల్లడించిన తీర్పుల్లో బాధితులు, వారి కుటుంబీకుల పేర్లను ప్రస్తావించడంతో వారికి ఎదురయ్యే కళంకం గురించి తెలియకపోవచ్చని ధర్మాసనం పేర్కొన్నది.

## శ్రీలంకకు 38 వేల మెట్రిక్ టన్నుల

# ఇంధనాన్ని పంపిన భారత్

న్యూఢిల్లీ మార్చి 28 (నేటి దర్శిని)

శ్రీలంకకు భారత్ 38 వేల మెట్రిక్ టన్నుల పెట్రోలియంను పంపింది. ఇందులో 20 వేల మెట్రిక్ టన్నుల డీజిల్, 18 వేల మెట్రిక్ టన్నుల పెట్రోల్ ఉన్నాయి. కొలంబోలోని భారత హైకమిషన్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధం, ప్రపంచ సరఫరా గొలుసులలో అంతరాయం కారణంగా శ్రీలంక ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభాన్ని తగ్గించడంలో ఈ సహాయం కీలక పాత్ర పోషిస్తుందని ఆ దేశ నాయకులు తెలిపారు. ఈ ఇంధన సరఫరా అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోడీ , శ్రీలంక




అధ్యక్షుడు అనురా కుమార దిసానాయకే మధ్య గతవారం జరిగిన టెలిఫోన్ సంభాషణ తర్వాత జరిగింది. శ్రీలంక ఐఒసి గతంలో పశ్చిమ ఆసియా, సింగపూర్ నుండి మార్చి నెల కోసం ఇంధన సరఫరాలను పొందింది. అయితే, ఒప్పందాలు కుదుర్చుకున్న సరఫరాదారులు పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా సరఫరా అంతరాయాలు, నౌకల లభ్యత లేకపోవడం వల్ల ఉత్పత్తులను అందించలేమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఐఒసిఎల్ ద్వారా 38,000 మెట్రిక్ టన్నుల అత్యవసర సరఫరాలను అందించాలని భారత్‌ను అభ్యర్థించారు. భారత ప్రభుత్వం, లంకా ఐఒసి ద్వారా శ్రీలంకకు ఇంధన సరఫరా నిరంతరాయంగా కొనసాగడానికి మద్దతు ఇస్తోంది. భారత్ అందించిన ఈ ఇంధన సహాయం శ్రీలంకకు ప్రస్తుత సంక్షోభ సమయంలో గణనీయమైన ఉపశమనాన్ని అందిచనుంది.

# సౌదీ యువరాజుతో ప్రధాని మోడీ చర్చలు

**- స్వేచ్ఛగా నౌకల రాకపోకలపై ఏకాభిప్రాయం**

న్యూఢిల్లీ మార్చి 28 (నేటి దర్శిని)

: పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభంపై ప్రధాని నరేంద్ర మోడీ శనివారం యువరాజు, సౌదీ అరేబియా ప్రధాని ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్లో చర్చించారు. నౌకల రవాణా స్వేచ్ఛగా జరిగేలా చూడాల్సిన ఆవశ్యకతను అంగీకరించారు. ప్రాంతీయ ఇంధన వసతులు, లక్ష్యాలపై జరుగుతున్న దాడులను భారత్ ఖండిస్తోందని పునరుద్ఘాటించారు. ఈ మేరకు మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. నౌకలు ప్రయాణించే మార్గాలను తెరిచి వుంచి, సురక్షితంగా వుండేలా చూడాల్సి




వుందన్నారు. ఈ విషయమై ఇరువురు నాయకుల మధ్య అంగీకారం నెలకొందన్నారు. సౌదీ అరేబియాలోని భారతీయుల భద్రతకు, సంక్షేమానికి వారు అందిస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత సౌదీ యువరాజుతో ప్రధాని ఫోన్లో చర్చలు జరపడం ఇది రెండవసారి. ప్రపంచవ్యాప్తంగా 20శాతం ఇంధన వనరులు రవాణా జరిగే అత్యంత కీలకమైన సముద్ర మార్గం హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టు వుంది. తాజా సంక్షోభం నేపథ్యంలో ఆ జలసంధిని దాటేందుకు చాలా కొద్ది నౌకలను మాత్రమే ఇరాన్ అనుమతిస్తోంది. ఈ యుద్ధం ఆరంభమైనప్పటి నుండి ఇప్పటివరకు అనేకమంది ప్రపంచ నేతలతో మోడీ మాట్లాడారు. అలాగే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా మోడీతో మాట్లాడారు. తాజా పరిస్థితులపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు.

# మమతా దీదీ ఎప్పుడూ బాధితురాలిగా నటించే రాజకీయాలే చేశారు

కోల్‌కతా మార్చి 28 (నేటి దర్శిని)

పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల వేడి మొదలైంది. శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా పశ్చిమ బెంగాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ప్రభుత్వంపై బిజెపి ఛార్జిషీట్‌ను విడుదల చేశారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ రాజకీయాల్లో ‘బాధితురాలి కార్డు’ను వాడుతున్నారని ఆయన ఆరోపించారు. కోల్‌కతాలో జరిగిన మీడియా సమావేశంలో అమిత్ షా మాట్లాడుతూ.. ‘మమతా బెనర్జీ ఎప్పుడూ బాధితురాలి పాత్ర పోషిస్తూ వచ్చారు. కొన్నిసార్లు ఆమె కాలు విరగ్గొట్టుకుంటారు. మరికొన్నిసార్లు తలకు కట్టు కట్టుకుంటారు. కొన్నిసార్లు అనారోగ్యానికి గురవుతారు. ఆపై మళ్లీ ఎన్నికల సంఘం ముందు నిలబడి, ఆ సంస్థను దూషిస్తూ నిస్సహాయతను నటిస్తారు. కానీ బాధితుల కార్డు రాజకీయాలను బెంగాల్ ప్రజలు ఇప్పుడు పూర్తిగా అర్థం



చేసుకున్నారని ఆమెకు చెప్పడానికే నేను వచ్చాను’ అని ఆయన అన్నారు. దేశంలో మరెక్కడా కనిపించని విధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సమయంలో కేవలం బెంగాల్‌లో మాత్రమే న్యాయాధికారులను నియమించారు. దీనికి కారణం ఏమిటి? మమతా బెనర్జీ దీనికి బెంగాల్ ప్రజలకు సమాధానం చెప్పాలి అని నిలదీశారు.అలాగే మమత ఎస్ఐఆర్‌పై ఆరోపణలు చేశారు. అయితే ఈరోజు నేను బెంగాల్ ప్రజలను అడగాలనుకుంటున్నాను. ఇక్కడ ఉంచిన ఆ చొరబాటుదారులను బెంగాల్ భవిష్యత్తును నిర్ణయించడానికి అనుమతించాలా? చొరబాటుదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచి బహిష్కరించడానికి మేము నిశ్చయించుకున్నాము. మా పార్టీ అజెండా అదే అని అమిత్ షా అన్నారు. మే 6వ తేదీన బెంగాల్లో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుంది. 45 రోజుల్లోగా సరిహద్దు కంచెకు అవసరమైన భూమిని బెంగాల్ బిజెపి ప్రభుత్వం భారత ప్రభుత్వానికి అందించి చొరబాటుదార్లను అరికడుతుంది. 77 వర్గాలను దీదీ ప్రభుత్వం ఓబిసి కేటగిరీలో చేర్చింది. ఈ 77లో 75 ముస్లిం వర్గాలే ఉన్నాయి. ఓబిసిలను మతం ఆధారంగా నిర్ణయిస్తారా? ఇది ఎక్కువ కాలం కొనసాగదు అని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక, నియామక కుంభకోణాల కారణంగా వయోపరిమితి ముగిసిపోయిన యువతకు ఐదేళ్ల వయో సడలింపు కల్పిస్తుంది. పారదర్శక నియామక ప్రక్రియను నిర్ధారించడంతోపాటు ఎస్ఎస్‌సి నియామకాలలో వారికి కూడా అవకాశం కల్పిస్తాము అని అమిత్ షా అన్నారు.


# టీఎన్జీవో ఎన్నికలు విజయవంతం చేయాలి

● తాలూకా అధ్యక్షుడు తిరుపతయ్య



**మిడ్జిల్, మార్చి 28, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా యూనిట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జడ్చర్ల తాలూకా అధ్యక్షుడు తిరుపతయ్య,ఎన్నికల అధికారి యుగంధర్ నాయుడులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-2029 కాలానికి సంబంధించిన ఈ ఎన్నికలు ఉద్యోగుల హక్కులు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వహిస్తున్న ముఖ్యమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. మార్చి 30 తేదీన జరగనున్న ఎన్నికల కార్యక్రమాలను ప్రతి ఉద్యోగి సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. నామినేషన్ దాఖలు, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు వంటి అన్ని దశల్లో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. పోలింగ్ రోజున ప్రతి సభ్యుడు తన ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు నైతిక విలువలు పాటిస్తూ ఎన్నికల్లో పోటీ చేయాలని, ఎన్నికల అనంతరం అందరూ ఐక్యంగా పనిచేసి యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ ఎన్నికలను విజయవంతం చేయడంలో యూనియన్ సభ్యులందరూ సహకరించాలని తాలూకా అధ్యక్షుడు తిరుపతయ్య కోరారు.

# రాక్ టౌన్ రెసిడెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు





**నాగోల్, మార్చి28 (నేటి దర్శిని):** రాక్ టౌన్ రెసిడెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాక్ టౌన్ కాలనీ కమ్యూనిటీ హాల్లో శ్రీరామనవమి వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం నుండి అభిషేకాలు, శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం, అన్న ప్రసాద వితరణ , రాత్రి సీత రాముల ఊరేగింపు కోలాటాలతో ఎంతో కనుల పండుగగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ఎంపీ ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరాముడి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఆకాంక్షించారు. అనంతరం కాలని అధ్యక్షులు వినోద్ రెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుండి ఇక్కడ శ్రీరామ నవమి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవానికి దాదాపుగా 2000 మందికి పైగా కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఊరేగింపులో దాదాపుగా 300 మందికి పైగా కాలనీవాసులు పాల్గొన్నారని అన్నారు. శ్రీ రామ నవమి వేడుకలు ఇంత దిగ్విజయంగా జరగడానికి సహకరించిన కాలనీ వాసులకు భక్తులకు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఒక్క వేడుకే కాదు ప్రతి పండుగను కూడా తాము ఎంతో ఐక్యమత్యంగా నిర్వహించుకుంటామని తెలియజేశారు. ప్రతి ఒక్కరు శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కాలనీవాసులు, భక్తులు, మహిళలు, పిల్లలు, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేవరకొండలో ఘన సన్మానం

●బార్ అసోసియేషన్, విజిలెన్స్ కమిటీ సభ్యులకు అభినందనలు




**దేవరకొండ, మార్చి 28 (నేటి దర్శిని ప్రతినిధి) :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలికి ఘన సన్మానం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సన్నాయిల ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వనం జగదీశ్వర్, కోశాధికారిగా ఈడెం రవికుమార్‌లను శాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందజేశారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన అనిత సురేష్‌ను కూడా శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఎన్నికైన వారు ప్రజలకు అందుబాటులో ఉండి సేవాభావంతో పనిచేస్తూ ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పున్న వెంకటేష్, డబ్బేకార్ పెంటోజి, పున్న బిక్షమయ్య, పెరికేటి శ్రీనివాస్ చారి, రెడ్డి కోటేశ్వరరావు, జూలూరి రేణు గౌడ్, లైబ్రేరియన్ శారద, కె పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ద్వారకమై నగర్ సీనియర్ సిటిజన్ సభ్యులతో ముచ్చటించిన కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, మార్చి28 (నేటి దర్శిని):** హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నేడు ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ద్వారకమై నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనం నందు సీనియర్ సిటిజన్ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలను వారి నుండి తెలుసుకొని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై చర్చించారు. అలాగే భవిష్యత్తులో కాలనీలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై సభ్యులతో అభిప్రాయాలను పంచుకున్నారు. సీనియర్ సిటిజన్‌ల సూచనలు ఎంతో విలువైనవని పేర్కొంటూ, వారి అనుభవం కాలనీ అభివృద్ధికి దోహదపడుతుందని కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వం మహిళకు రక్షణ కల్పించడంలో విఫలం: ఎర్రబెల్లి స్వర్ణ

● కాంగ్రెస్ లో ప్రతి మహిళలకు ప్రతి మహిళకు సముచిత స్థానం




**ఉమ్మడి వరంగల్, మార్చి 28(నేటి దర్శిని బ్యూరో):** మహిళలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. శనివారం హనుమకొండ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోనే మహిళలకు పెద్ద పీట వేస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ లో పని చేస్తే ప్రతి మహిళకు సముచిత స్థానం కల్పిస్తామని, మహిళలు ఆర్థికంగా రాజకీయంగా ఎదగడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళలకు అవకాశం కల్పిస్తుందని అన్నారు. జిల్లాలలో కొత్త కమిటీలను వేసి మహిళలను చైతన్య పరుస్తానని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

# రామానంద కాలనీలో ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



**నాగోల్, మార్చి28 (నేటి దర్శిని):** నాగోల్ డివిజన్ పరిధి రామానంద కాలనీలో సీతారామ కళ్యాణం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కన్నుల పండుగ నిర్వహించారు. ఈ కళ్యాణం గత ఏడు సంవత్సరాల నుంచి కాలనీ అసోసియేషన్ వారు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో 200 మంది కి పైగా భక్తులు పాల్గొని ఆ సీతారామ చంద్రుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన కాలనీ అసోసియేషన్ వారికి భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ ఆర్ ఎస్ ఆర్ ఏ ప్రసాద్, జనరల్ సెక్రటరీ డిఎస్ఆర్ మూర్తి, ట్రెజరర్ హనుమంతరావు, జాయింట్ సెక్రెటరీ రాజేశ్వరి ముఖ్య సలహాదారు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3 నెలలకు 49. 50 లక్షల క్వింటాల బియ్యం పంపిణీ కి సన్నాహాలు...!



**ఉమ్మడి వరంగల్, మార్చి 28 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలో రేషన్ షాపుల ద్వారా ఏప్రిల్ లో 3 నెలల బియ్యాన్ని రేషన్ కార్డుల దారులకు ఒకేసారి పంపిణీ చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది.3 నెలలకు సంబంధించిన 49.50 లక్షల క్వింటాల బియ్యాన్ని పంపిణీ చేయడానికి పౌరసరఫరాల శాఖ సిద్ధం చేసింది. ప్రతి నెల 16. 50 లక్షల కింటాల బియ్యం పంపిణీ జరిగేది. జిల్లాల వారీగా వరంగల్ జిల్లాకు 26,6676 రేషన్ కార్డులు, హనుమకొండ జిల్లాకు 22,8144, జనగామ 16,1147, మహబూబాబాద్ జిల్లాకు 24,0370, భూపాలపల్లి జిల్లాకు 12,8559, ములుగు జిల్లాకు 91,505 రేషన్ కార్డుల ద్వారా బియ్యం పంపిణీ చేయుటకు పౌరసరఫరాల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రానున్న మూడు నెలలు వేసవి కాలం తీవ్రంగా ఉంటుందని ప్రజలకు ముందుగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నట్లు సమాచారం.

# రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

● కుర్మేడు ఎక్స్ రోడ్డులో నిర్వహణ చింతపల్లి ఎస్సై ముత్యాల రామ్మూర్తి



**చింతపల్లి మార్చి 28 (నేటి దర్శిని ప్రతినిధి):** చింతపల్లి మండలం కుర్మేడు ఎక్స్ రోడ్డులో శనివారం పోలీసులు ఎస్సై ముత్యాల రామ్మూర్తి రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. “అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ క్యాంపెయిన్--2026”లో భాగంగా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తలు ఎస్సై ముత్యాల రామ్మూర్తి వివరించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద లింకులు, కాల్స్‌కు స్పందించకూడదని సూచించారు. ప్రజలు రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు.

# ఘడియ గౌరారం లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**చింతపల్లి మార్చి 28 (నేటి దర్శిని ప్రతినిధి):** చింతపల్లి మండలం ఘడియ గౌరారం గ్రామంలో కోట్ల శోభ భర్త శ్రీను నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు, ఉప సర్పంచ్ అదిరాల కృష్ణయ్య, ఎంపీడీఓ సుజాత, పంచాయతీ కార్యదర్శి సురేష్, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే వార్డు సభ్యులు నాగమళ్ళ కవిత యాదగిరి, గుండెబోయిన సైదులు, షేక్ సైదా మస్తాన్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శివకృష్ణ, తుళ్ళ రమేష్, ఉజ్జిని సంతోష్ రావు, షేక్ జానిమియా, పొట్టిముతు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి, ఇలాంటి సంక్షేమ పథకాల ద్వారా గ్రామాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి

- గ్రామ సర్పంచ్ గోవు అంజమ్మ ఆధ్వర్యంలో రంగాపూర్ గ్రామంలో నూతన డ్వాక్రా మహిళ భవన నిర్మాణ భూమిపూజ
- నిధులు మంజూరు చేసిన షాద్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మహిళా సంఘాలు గ్రామ ప్రజలు





**నందిగామ, మార్చి28 (నేటి దర్శిని ప్రతినిధి):** నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో మహిళా భవనం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగాపూర్ గ్రామ సర్పంచ్ గోవు అంజమ్మ హాజరై శుభారంభం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గోవు అంజమ్మ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. మహిళా భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మహిళా సంఘాలు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సాధికారత కోసం ఇలాంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ విలేజ్ ప్రెసిడెంట్ ఆకుల జ్ఞానేశ్వర్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమార్ గౌడ్, నందిగామ చైర్మన్ రాజుగోపాల్, రవి కుమార్, కావాలి కృష్ణ, డిప్యూటీ సర్పంచ్ బస్వారాజ్, వార్డు సభ్యులు సతీష్, అవినాష్, కావాలి అంజయ్య, కల్వకొలు శేఖర్, రాంచంద్రి, రాఘవేందర్, శ్రీనివాస్, చందు, శ్రీరాంలు, అజయ్, హన్మంతు, నవీన్, గొల్ల జంగయ్య, తోట మహిపాల్, చంద్రయ్యతో పాటు మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. మహిళా భవనం నిర్మాణంతో గ్రామంలో మహిళలకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకునే సౌకర్యం లభిస్తుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

# దేవరకొండ ఉప సర్పంచ్ ఫోరం కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా కొర్ర రవి నాయక్



**దేవరకొండ మార్చి 28 (నేటి దర్శిని ప్రతినిధి) :** దేవరకొండ ఉప సర్పంచ్ ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూర్యతండ గ్రామపంచాయతీకి చెందిన కొర్ర రవి నాయక్‌ను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా మూడవత్ భాస్కర్ నాయక్ (సబావత్ తండ), మరుపాకల సురేష్ గౌడ్ (తాటికోలు) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అంకూరి సురేష్ (తూర్పుపల్లి), కార్యదర్శిగా సబావత్ లక్ష్మి గోవింద్ (కట్టాకొమ్మ తండా), కోశాధికారిగా పోతురాజు ధనరాజ్ యాదవ్ (జెల్లేపల్లి) బాధ్యతలు స్వీకరించారు. మహిళా ప్రతినిధిగా రామావత్ సునీతా నాగు (రత్య తండా) నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రామావత్ శ్రీను (శేరెపల్లి), పోతురాజు మల్లేష్ (కచారం) ఎంపికయ్యారు. కమిటీ సభ్యులుగా మూడవత్ బాలాజీ, వద్యా పార్వతి రఘు, పి. శాంతి సురేష్, రామావత్ నీలా చిన్నలను ఎంపిక చేశారు. కొత్త కమిటీ గ్రామాల అభివృద్ధి, ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

# ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్థుల శ్రీకారం

- ప్రతి ఓటరుకు రూ.3,000 విరాళం - ఏకగ్రీవ తీర్మానం



**దేవరకొండ, మార్చి 28 (నేటి దర్శిని ప్రతినిధి):** నల్గొండ జిల్లా డిండి మండలం టీ గౌరారం కాలనీలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామ ప్రజలు, పెద్దలు శ్రీకారం చుట్టారు. శనివారం నిర్వహించిన గ్రామ సమావేశంలో ఆలయ నిర్మాణ వ్యయం, నిధుల సేకరణపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణం కోసం రూ.3,000 విరాళంగా అందజేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విరాళాలను ఏప్రిల్ 1 నుంచి జూన్ 1 వరకు సమర్పించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పేర్ల కళ్యాణి లింగమయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఐకమత్యంతో ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఉపసర్పంచ్ పిల్లి లక్ష్మమ్మ భక్తిశ్రద్ధలతో పునర్నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిల్లి బాలయ్య, వార్డు సభ్యులు ఆంజనేయులు, పిల్లి వెంకటయ్య, విలేఖరి పేర్ల మహేష్, గ్రామ పెద్దలు నల్లగాసు సత్తయ్య, వరికుప్పల వెంకటేశులు, బద్దె శంకర్, యువకులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుమలగిరి తండాల ప్రజల నీటి తంటు! ఉగాది దాటింది అంటే నీటి ఎద్దడి అంతా!

- తిరుమలగిరి తండాల్లో త్రాగునీటి కష్టాలు తారాస్థాయికి
- ఉగాది దాటితే నీటి ఎద్దడి భయం... తిరుమలగిరి తండాల ఆవేదన
- బిందెడు నీళ్ల కోసం గంటల నిరీక్షణ... గిరిజన తండాల దుస్థితి
- మిషన్ భగీరథ నీళ్లు ఎక్కడ? తండాల ప్రజల ఆగ్రహం
- “సారూ మా గ్రామానికి నీరు కావాలి”... తిరుమలగిరి తండాల విన్నపం





**తిరుమలగిరి, మార్చి 28 (నేటి దర్శిని):** నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం తిరుమలగిరి సాగర్ మండలంలోని గిరిజన తండాలలో త్రాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గట్టుమీద తండా, రంగుల తండా, తూటిపేట తండా, గరికిన తండా, సుంకుశాల తండాలలో నీటి కొరత రోజురోజుకీ పెరుగుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. చుట్టూ సాగర్ నీరు ఉన్నా తాగునీటికి నోచుకోలేని పరిస్థితి నెలకొనడం స్థానికులను కలవరపెడుతోంది. ఉగాది మాసం దాటితే ప్రతి ఏడాది నీటి ఎద్దడి తప్పదని, ఈసారి పరిస్థితి మరింత దారుణంగా ఉందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లలు ఏర్పాటు చేసినప్పటికీ, ప్రస్తుతం వాటిలో నీరు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బిందెడు నీళ్ల కోసం గంటల తరబడి వేచి చూసినా చెంబు నిండడం లేదని మహిళలు చెబుతున్నారు. ప్రస్తుతం తండావాసులు దూర ప్రాంతాల్లోని పొలాల బావులు, బోర్ల వద్దకు వెళ్లి నెత్తిపై బిందెలు మోసుకొని నీటిని తెచ్చుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు నీటి కోసం పోటీ పడాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి కొరత తీవ్రంగా ఉండడంతో, బాటసారులు నీళ్లు అడిగినా ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని గ్రామస్థులు చెబుతున్నారు. “బాటిల్ రక్తం ఇవ్వగలం కానీ చెంచాడు నీళ్లు ఇవ్వలేము” అనే స్థాయికి పరిస్థితి దిగజారిందని వారు వాపోతున్నారు. ఇప్పుడే మార్చి చివరి వారంలో పరిస్థితి ఇలా ఉంటే, రాబోయే ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మూగజీవాలకు నీళ్లు ఎలా అందించాలనే ఆందోళన కూడా వారిలో వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రభుత్వాలు మారినా తమ గ్రామాల పరిస్థితి మారలేదని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్నప్పటికీ, అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తండాలలో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే ఉద్యమానికి దిగుతామని హెచ్చరిస్తున్నారు.


# వర్ధన్నపేట నియోజకవర్గానికి 100 ఈవి బస్సులు నూతన ఈ వి బస్ చార్జింగ్ స్టేషన్ కోసం....

- ఆర్టీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు వినతి
- స్థానికులకు ఆర్టీసీలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి




**ఉమ్మడి వరంగల్, మార్చి 28 (నేటి దర్శిని బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లుతూ వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వరంగల్ మండల పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పైడిపల్లి గ్రామంలో సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, ఆ స్థలంలో నూతన ఈ వి చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల ప్రాంతీయ రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, పర్యావరణానికి అనుకూలమైన ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతుందని వివరించారు. నియోజకవర్గానికి 100 కొత్త ఈ వి బస్సులను కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ బస్సుల ద్వారా ప్రజలకు మెరుగైన, ఆధునిక రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక, కొత్తగా ఏర్పాటు చేయనున్న బస్ స్టేషన్, ఈ వి బస్సుల నిర్వహణలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా పాలు....!



**ఉమ్మడి వరంగల్, మార్చి 28 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1. 88 లక్షల మంది పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు ప్రయోజనం కలగనుంది. ఏప్రిల్ 1 నుంచి అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు నిత్యం పాలను అందించుటకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. జిల్లాల వారీగా వరంగల్ జిల్లాలో 47,290, హనుమకొండ జిల్లాలో 43,090, మహబూబాబాద్ జిల్లాలో 39,190, భూపాలపల్లి జిల్లాలో 21,700, ములుగు జిల్లాలో 18,540, జనగామ జిల్లాలో 18,508 పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు ప్రయోజనము చేకూరుతుందని అధికారులు తెలిపారు.

## సీతారామచంద్ర స్వామి జాతర రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్




**చింతపల్లి మార్చి 28 (నేటి దర్శని ప్రతినిధి) :**
చింతపల్లి మండలం గోడుకొండ్ల గ్రామంలో నిర్వహించిన సీతారామచంద్ర స్వామి జాతర రథోత్సవ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, గ్రామ మాజీ సర్పంచ్ అంగురేకుల గోవర్ధన్, మాస భాస్కర్, మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, మాజీ జడ్పీటీసీ హరినాయక్, శేఖర్ గౌడ్, మద్దెల కృష్ణ, ఊరె లక్ష్మణ్, ఖలీల్, దేవస్థానం కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం గా భవాని ప్రసాద్....!



**ఉమ్మడి వరంగల్, మార్చి 28 (నేటి దర్శని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ గా సోమరాజు భవాని ప్రసాద్ ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది .భవాని ప్రసాద్ 2013, 14 సమయంలో వరంగల్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ గా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ప్రస్తుతము పనిచేస్తున్న వరంగల్ ఆర్ ఎం విజయభాను ను అదిలాబాద్ జిల్లా ఆర్ఎం గా బదిలీ చేశారు.

## లెమన్ అండ్ స్పూన్ క్రీడా పోటీల్లో పాల్గొన్న మంత్రి సురేఖ, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**ఉమ్మడి వరంగల్, మార్చి 28 (నేటి దర్శని బ్యూరో):**
హైదరాబాదులో శాసనసభ, శాసన మండలి సభ్యులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి లేమన్ అండ్ స్పూన్ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు .ఈ క్రీడా పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి స్థానంలో నిలవగా, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి రెండవ స్థానం సాధించారు. మొదటి, రెండవ స్థానం సాధించిన మంత్రి ,ఎమ్మెల్యేను ప్రజా ప్రతినిధులు సన్మానించారు.

# మూసి వాగులో ఇసుక మాఫియా

- అక్రమ తవ్వకాలపై పోలీసుల ఉక్కుపాదం
- అజీంపేట శివారులో భారీ ఎత్తున ఇసుక దందా వెలుగులోకి
- 20 ట్రాక్టర్లు, జెసిబితో వాగు గర్భం తవ్వకం
- రెవెన్యూ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు
- మాఫియా వెనుక ఉన్న సూత్రధారులపై లోతైన దర్యాప్తు
- కోట్ల ఆదాయ నష్టం.. ప్రభుత్వానికి భారీ దెబ్బ
- వాగు సహజ ప్రవాహం దెబ్బతింటుందని నిపుణుల హెచ్చరిక
- అక్రమాలపై కఠిన చర్యలకు అధికారుల హెచ్చరిక




**యాదాద్రి భువనగిరి జిల్లా, మార్చి 28 (నేటి దర్శిని):**
ప్రకృతి వనరులను దోచుకుంటూ కోట్ల రూపాయల అక్రమ దందా సాగిస్తున్న ఇసుక మాఫియాపై అధికార యంత్రాంగం ఉక్కుపాదం మోపడం ప్రారంభించింది. మూసి వాగును లక్ష్యంగా చేసుకుని నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ జరుగుతున్న అక్రమ తవ్వకాలు వెలుగులోకి రావడంతో జిల్లాలో కలకలం రేగింది.అడ్డగూడూరు మండల పరిధిలోని అజీంపేట గ్రామ శివారులో శనివారం ఉదయం భారీ స్థాయిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న అధికారులు చూసింది షాకింగ్ దృశ్యమే. ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు 20 ట్రాక్టర్లు, ఒక జెసిబి సహాయంతో మూసి వాగు గర్భాన్ని తవ్వి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్న అక్రమార్కులు అధికారుల కంటికి చిక్కారు. ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా విస్మరించి సాగుతున్న ఈ దందా వెనుక పెద్ద ముఠా ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయ నష్టం కలిగించే ఈ అక్రమ కార్యకలాపాలపై రెవెన్యూ అధికారులు వెంటనే అడ్డగూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ అక్రమ ఇసుక దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనే దానిపై లోతుగా విచారణ చేపట్టారు. అవసరమైతే వాహనాల స్వాధీనం, అరెస్టులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

ఇక అక్రమ ఇసుక తవ్వకాల వల్ల మూసి వాగు సహజ ప్రవాహం దెబ్బతింటోందని, భూగర్భ జలాలు క్షీణిస్తున్నాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాగు తీరాలు కూలిపోవడం, భవిష్యత్తులో వరదల ముప్పు పెరగడం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయని తెలిపారు.

స్థానిక ప్రజలు కూడా ఈ దందాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతిని నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఇకపై ఇసుక మాఫియాను ఏ మాత్రం ఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాల స్వాధీనం, భారీ జరిమానాలు, జైలుశిక్ష తప్పదని హెచ్చరిస్తూ ప్రకృతి పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని కఠిన సందేశం ఇచ్చారు.

# మేకగూడలో సిసి రోడ్డు పనులకు ఘనంగా శంకుస్థాపన

- నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు

**నందిగామ, మార్చి 28 (నేటి దర్శిని ప్రతినిధి):**
నందిగామ మండల పరిధిలోని మేకగూడ గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే సహకారంతో హెచ్ఎండీఏ నిధులు మంజూరై సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రమావత్ మారు రాజు నాయక్ ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి పట్ల ఎమ్మెల్యే కట్టుబాటు వల్లే ఈ పనులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఆయన అన్నారు.ఇంకా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి కొనసాగుతుందని,



ప్రజల సహకారంతో మేకగూడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్నేశ్వర్ రెడ్డి, పర్వతాలు, రవీందర్ రెడ్డి, సుక్య నాయక్, ఎండి ఖాదర్, ఎండీ జఫ్ఫార్, బండారు రాజు ముదిరాజ్, కుమ్మరి మల్లేష్, ఎండీ హనీఫ్, సకాలి మల్లేష్, అమర్నాథ్ రెడ్డి, సీ రవీందర్ రెడ్డి, సత్తెనరాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేష్, దామోదర్ రెడ్డి, సత్యం రెడ్డి, శ్రీను, సత్తయ్య, యాదయ్య, ప్రదీప్ రెడ్డి, నర్సింలు, డాక్టర్ నర్సింహా, బుగ్గ రాంలు తదితరులు గ్రామ ప్రజలు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎంప్లాయిస్ కాలనీలో ఘనంగా సీతారామ కళ్యాణం

- పాల్గొన్న డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ సువర్ణ కిషన్ నాయక్

**మహబూబ్ నగర్, మార్చి 28 (నేటి దర్శిని):**
శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబ్ నగర్ పట్టణంలోని 48వ డివిజన్ పరిధిలోని మర్లు ఎంప్లాయిస్ కాలనీలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో, ఐశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.



కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి సువర్ణ కిషన్ నాయక్ కాలనీ వాసులతో కలిసి సీతారాముల కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సువర్ణ కిషన్ నాయక్ మాట్లాడుతూ, 48వ డివిజన్ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మహోత్సవానికి విచ్చేసిన డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాలనీ వాసులతో కలిసి ఈ పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సల్మాన్, రమేష్ రెడ్డి, కిషన్ నాయక్, రఘు, మాక్సూద్, మైత్రి యాదయ్య, మెట్టుకాడి శ్రీనివాస్, శ్యామ్ సుందర్, మెట్టుకాడి ప్రభాకర్, సందీప్, సుధాకర్, లక్ష్మణ్, విష్ణు, చంద్రయ్య, గూడెం ఆంజనేయులు, సంజీవ్ తదితర నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కనగల్‌లో మజ్జిగ పంపిణీ కంబాల శివ లీల



**కనగల్, మార్చి 28 (నేటి దర్శిని):** ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే సేవా కార్యక్రమంగా కనగల్ మండలంలో మజ్జిగ పంపిణీ చేపట్టారు. న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ శివ లీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.
మండలంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందిన వారు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా డాక్టర్ శివ లీల మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు వచ్చి చలివేంద్రాల వద్ద మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమాజానికి సేవ చేయడం ద్వారా మానవత్వాన్ని నిలబెట్టవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బస్టాండ్ కంట్రోలర్ మట్టపల్లి వెంకటేశ్వర్లు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## కొత్తూరులో అర్ధరాత్రి దాకా అద్భుత శోభాయాత్ర..!

- చిన్నారుల కూచిపూడి నృత్యంతో కళకళలాడిన కొత్తూరు..
- పెద్దల చేతుల మీదుగా చిన్నారులకు బహుమతులు అందజేసిన దాత సిటీ కేబుల్ వెంకటేష్..



**కొత్తూరు, మార్చి28 (నేటి దర్శిని ప్రతినిధి):** పురపాలక కేంద్రంలో నవమి వేడుకలను పురస్కరించుకొని జగదభిరాముడి కళ్యాణం అంగరంగ వైభవంగా సాగింది. సాయంత్రం పురవీధుల గుండా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయుడి విగ్రహాలను ఊరేగించారు. వాడవాడలో భక్తులు ఎదురెళ్లి దర్శించుకున్నారు. నాట్య శ్రీ కళామండలి నిర్వాహకురాలు శ్రీజ ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్యంతో అలరించారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు ఈ చిన్నారుల సేవను గుర్తిస్తూ స్థానిక సిటీ కేబుల్ వెంకటేష్, గ్రామ పెద్దలు సుదర్శన్ గౌడ్, మాసుల లక్ష్మయ్య, అంజయ్య, నాగరాజు చారి, రాజశేఖర్ రెడ్డి, రవి నాయక్, వాటర్ మల్లేష్, ఆంజనేయులు గౌడ్, శ్రీను చారి, జి. రవి , బాలు, మాసుల రామకృష్ణ ముదిరాజ్, అనిల్, చేతుల మీదుగా చిరు కానుకలను అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజు శర్మ, గణేష్ యాదవ్, బాలు, మాసల సురేందర్, నరసింహ గౌడ్, వెంకన్న, అనిల్,మురళి, ఉదయ్, రామ్‌జీ, ధీరజ్ పాల్గొన్నారు.

## షాద్ నగర్ న్యాయమూర్తి స్వాతి రెడ్డిని కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి

- న్యాయ మూర్తులు కొత్త రవి, మల్యాల సాహితిలను కలుసుకున్న కమిటీ సభ్యులు



**షాద్ నగర్,మార్చి28 (నేటి దర్శిని ప్రతినిధి ):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవలే ఎన్నికల్లో గెలుపొందిన జగన్మోహన్ రెడ్డి శనివారం నూతన కమిటీ సభ్యులతో కలిసి జిల్లా అదనపు జడ్జి స్వాతి రెడ్డి, అదేవిధంగా జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవిని, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితిని వారందరూ మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం సమర్పించారు. సదరు న్యాయమూర్తులు ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సబియా సుల్తానా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసమూర్తి, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, కోశాధికారి రహీముద్దీన్, లైబ్రరీ సెక్రటరీ జయమ్మ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ శంకర్, అసోసియేషన్ సభ్యులు రూప్ సింగ్, పబ్బే శ్రీశైలం, గణేష్ తదితరులు కలుసుకున్నారు..

# టెలిఫోన్ కాలనీలో అక్రమ నిర్మాణం

- రోడ్డు ఆక్రమణ ఆరోపణలు
- 40 అడుగుల రోడ్డును 30గా మార్చి చూపించారా? డాక్యుమెంట్లపై అనుమానాలు
- ప్లాట్ నెం.190లో వివాదాస్పద నిర్మాణం





**ఎల్బీనగర్, మార్చి 28 (నేటి దర్శిని):** సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో అక్రమ నిర్మాణం వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. కాలనీ రోడ్డు హద్దులను ఆక్రమిస్తూ గృహ నిర్మాణం కొనసాగుతోందని టెలిఫోన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ప్లాట్ నెంబర్ 190, రోడ్ నెంబర్ 5లో జరుగుతున్న ఈ నిర్మాణంపై అసోసియేషన్ ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మొత్తం 359 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలంలో ఇప్పటికే 200 గజాలు విక్రయించగా, మిగిలిన 159 గజాల్లో మాత్రమే నిర్మాణం జరగాల్సి ఉందని వారు తెలిపారు. అయితే, నిర్మాణదారులు తమ పరిమితిని దాటి రోడ్డును ఆక్రమిస్తూ పనులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కాలనీ లేఔట్ ప్రకారం 40 అడుగుల రహదారి ఉండగా, దానిని 30 అడుగులుగా చూపిస్తూ పత్రాల్లో మార్పులు చేసి జిహెచ్ఎంసి అధికారులను తప్పుదోవ పట్టించారని అసోసియేషన్ పేర్కొంది. తప్పుడు పత్రాలతో అనుమతులు పొందడం పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కాలనీ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, సెక్రటరీ మధుసూదన్, ట్రెజరర్ ఏజీ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లు మల్లేశ్వరి యాదవ్, మైపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఏవి దినేష్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులు సంఘటితంగా స్పందించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా కొనసాగుతున్న ఈ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత వ్యక్తి విష్ణు వందన (ప్రవీణ్ భార్య)పై కఠిన చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని చట్టపరమైన చర్యలు చేపట్టాలని టెలిఫోన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఘాటుగా విజ్ఞప్తి చేసింది.

# జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యురాలు అనితసురేష్‌కు ఘన సన్మానం



**దేవరకొండ, మార్చి 28 ( నేటి దర్శిని):** నల్గొండ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన యేకుల అనిత సురేష్ ను శనివారం దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అనిత సురేష్ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ బాధ్యతాయుతమైన పదవి ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని, పారదర్శకమైన పాలన అందించడంలో తన వంతు పాత్ర పోషించి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని కోరారు. అనంతరం యేకుల అనిత సురేష్ మాట్లాడుతూ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా తనను ఎంపిక చేసినందుకు ప్రభుత్వానికి, కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ముఖ్యంగా అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందేలా పర్యవేక్షిస్తానని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు, పున్న వెంకటేష్, పున్న బిక్షమయ్య, డబ్బికార్ పెంటోజి, పెరికేటి శ్రీనివాస్ చారి, జూలూరి రేణు గౌడ్, పెద్దిరాజు, లైబ్రేరియన్ శారద మరియు బీసీ సంఘాల నాయకులు, వివిధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో భక్తులకు ప్రసాదం చేసిన కృష్ణ గోపాల్ సేవా సమితి





**నాగోల్, మార్చి 28 (నేటి దర్శిని):** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రసిద్ధ కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో భక్తులకు ప్రసాద పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితికి ప్రసాద సేవ చేసే అవకాశం లభించడం పట్ల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 2500 మంది భక్తులకు ప్రసాదం పంపిణీ చేయగా, ఆలయానికి విచ్చేసిన భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. సమితి అధికారులు, సభ్యులు, మిత్రులు కలిసి సేవా భావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అదేవిధంగా, ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బాటసారులకు చల్లని మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా సుమారు 2000 మంది తమ దాహాన్ని తీర్చుకున్నారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఈ రెండు కార్యక్రమాలను సమితి సభ్యులు "జై శ్రీ రామ్" నినాదాలతో ప్రారంభించడం విశేషం. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి సచిన్ అగర్వాల్, కోశాధికారి కుష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా పాల్గొన్నారు. అలాగే ఈసీ సభ్యులు ఆనంద్ చోక్సా, పాకా సతీష్ యాదవ్, కాళీ దినేష్, సునీల్ దరాడే, సురేష్ ధావలే, కాళీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# వీర్లపల్లిలో విద్యుత్ కష్టాలకు చెల్లు..

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో 100 కేవి ట్రాన్స్ ఫార్మర్లు
- 40 స్తంభాలతో గ్రామానికి ప్రత్యేక లైను



**నందిగామ, మార్చి28 (నేటి దర్శిని ప్రతినిధి):** ఎమ్మెల్యే స్వగ్రామమైన వీర్లపల్లి లో విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.. స్వయంగా ఆయన చొరవ తీసుకోవడంతో సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలో లో వోల్టేజ్ సమస్యలు ఉండడానికి దీనిని పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే వీడ్లపల్లి శంకర్ మూడు కొత్త 100 కె.వి ట్రాన్స్ ఫార్మర్లు, జంక్షన్ నుంచి వీర్లపల్లి గ్రామానికి నేరుగా 40 స్తంభాలతో ప్రత్యేక లైను, పాత స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. దీనివల్ల గ్రామంలో 24 గంటలు విద్యుత్ అందుబాటులో ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. అభివృద్ధి పథంలో వీర్లపల్లి గ్రామాన్ని ముందుకు తీసుకు వెళుతున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పెద్దలు చంద్రశేఖర్ గౌడ్, నవాజ్ రెడ్డి, చిందం నరసింహులు, ప్రభాకర్ రెడ్డి, చాకలి నరసింహ, ఎండి హైమాద్, దుబ్బ లక్ష్మయ్య, చాకలి శ్రీశైలం, కల్వకోలు రాఘవేంద్ర, చాకలి శ్రీనివాస్, పాలకొండ శ్రవణ్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, RNI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365